- జిల్లాలో 1,102 క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు శూన్యం
- వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల వినతి



క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం..

యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారిని జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎది గేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అందుకు జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం అధికారులు పట్టించుకోక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

వాంకిడి, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఊరూరా తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేసింది. వాటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చెత్తా చెదారంతో నిండిపోయాయి. కొన్ని మైదానాలు ఆటలకు అనువుగా లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాల కల్పనలో అధికారులు పట్టించకోకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి.

● 15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల్లో 1,102 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. వీటిలో 902 ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలం గుర్తించగా మిగితా 200 ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తిం చలేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 878 క్రీడా ప్రాంగ ణాలను పూర్తి చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతు న్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఎక్కడా అన్ని విధాల సౌకర్యాలు కృలించిన దాఖలాలు లేవు. ఒక్కో ప్రాంగణలో భూమి చదును చేసేందుకు, మొక్కలు నాటేందుకు సౌకర్యాల కల్పనకు రూ. 2 లక్షల చొప్పున ప్రభుత్వ విడుదల చేసింది. అనేక ప్రాంగణాల్లో నామ్‌కే వాస్తేగా పనులు చేసి అధికారులు చేతులు దులుపినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్రీడా ప్రాంగణాలపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహి స్తుండడంతో అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి రికార్డుల్లో మాత్రం పనులు పూర్తి అయినట్లు చూపి స్తున్నారు. దీంతో చాలా మైదానాలు చదును చేయకపోగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కొన్ని ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా ఉండి కనీసం సరైన రహదారి సైతం లేకుండా ఉన్నాయి.

● జిల్లాకు 937 క్రీడా కిట్లు..

క్రీడా ప్రాంగణాల కోసం గత ప్రభుత్వం జిల్లాకు 937 క్రీడా కిట్లను మంజూరు చేసింది. ఒక్కో కిట్లో క్రికెట్, వాలీబాల్ కిట్, టీషర్టులు, మూడు జతల డంబెల్స్‌తో పాటు మొత్తం 23 రకాల ఆట పరికరాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల వారిగా అధికారులు కిట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం క్రీడామైదానాలు ఆటలకు అనువుగా లేకపోవడంతో వాటిని విని యోగించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్రీడా కిట్లు పంచాయతీల్లో మూలకు చేరాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

● బోర్డులకే పరిమితం..

గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన క్రీడా మైదానాలు బో ర్డులకే పరిమితమయ్యాయి. ఊరికి దూరంగా ఆటల కు అనుకూలంగా లేని స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారన్న ఆరోప ణలు ఉన్నాయి. అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఏర్పా టు చేసిన క్రీడా మైదానాలు ఒక్కటి కూడా క్రీడా పో టీలు నిర్వహించేందుకు అనువుగా లేకపోవడంతో గ్రామీణప్రాంతాల్లో యువకులు, క్రీడాకారులు వ్యవ సాయ భూముల్లోనే ఆటలు ఆడుతున్నారు.. ఏటా గ్రామాల్లో యువకులు పర్వదినాలను పురస్క రించుకొని క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. క్రీడా మైదానాలు లేపోవడంతో పంట పొలాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడా మైదానాలను ఉపయోగంలోకి తీసుకు రావడంలో అధికారులు విఫలమయ్యారని చెబుతున్నారు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన క్రీడామైదానాలను ఉపయోగంలోకి తీసుకువచ్చి గ్రామీణ క్రీడాకారులకు పోటీలు నిర్వహించేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి
- అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడామైదానాలను అధికారులు వినియోగంలోకి తీసుకు రావాలి. గ్రామీణ ప్రాంతాల్లో వాటి నిర్వహణ సక్రమంగా లేక పోవడం తో మైదానాలు అలంకారప్రాయంగా మారాయి. ప్రభుత్వం స్పందించి క్రీడాకారులను ప్రోత్సహించేం దుకు మైదానాలను వినియోగంలోకి తీసుకురావాలి.

ఆదేశాలు వస్తే పనులు చేపడుతాం..
శ్రావణ్‌కుమార్- ఏపీవో



ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పనులు చేపడు తాం. గత ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. చాలా చోట్ల క్రీడా మైదానాలు అసంపూర్తిగా మిగిలాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు లేవు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అన్నారు. పోలీసు అధికారులతో సోమవారం నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 6న నిర్వహించే లోక్ అదాలత్‌లలో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ చేసుకునేలా వివరించాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమని తెలిసేలా చేయాలన్నారు. దీంతో సమయం, డబ్బులు ఆదా అవుతా యని చెప్పాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న నేరాల తీరుపై చర్చించారు. సమావేశంలో జిల్లా జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్, ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజన్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి సబ్సిడీ లోన్లు ఇవ్వాలని అదనపు కలెక్టర్ డేవిడ్‌కు సోమవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా కుమరం భీం అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన వారందరికీ రుణాలు అందజేయాలని కోరారు. బ్యాంకు సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరిగెల మధుకర్ గౌడ్, సోనాపూర్ పటేల్, దొందేరావు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీని కలిసిన ఎమ్మెల్యే



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కార్యాలయంలో సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వివరించారు. గోలేటిలో ఓపెన్ కాస్ట్ క్వారీని త్వరగా ప్రారంభించాలని వినతిపత్రం అందజేశారు.

సబ్‌స్టేషన్ ఎదుట కాలనీవాసుల ఆందోళన



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కెరమెరి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒకటో వార్డులో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో కాలనీవాసులు సోమవారం సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసి ఇలియాజ్ హైమద్ మాట్లాడుతూ ఆరు నెలలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సుధాకర్, పోశెట్టి, మెంగాజీ, ఫజిల్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పులి హత్య కేసులో విచారణ వేగవంతం

పెంచికలపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలంలో ఐదు రోజుల క్రితం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి పులి మృతి చెందిన కేసులో అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో అనుమానితులను అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పెంచికలపేటలో పులిని హతమార్చినప్పటికీ కళేబరం అవశేషాలు మాత్రం దహెగాం మండలంలోని ఓ గ్రామంలో లభ్యమైనట్లు సమాచారం. ఈ కేసులో సుమారు 30 మందికి పైగా అనుమానితులను తీసుకు వచ్చి విచారించారు. ఈ కేసుతో సంబంధం లేదని నిర్ధారించుకొని కొంత మందిని వదిలిపెట్టారు. పలువురు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం దహెగాం మండలం లోని ఓ గ్రామంలోని ఓ ఇంట్లో సోదాలు చేసినట్లు సమాచారం. సోదాల్లో పుల అవశేషాలు చర్మం, గోర్లు, మీసాలు, దంతాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్ టిబేవాల్‌ను వివరణ కోరగా విచారణ కొనసాగుతుందని చెప్పారు. పూర్తి వివరాలు మంగళవారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్ అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సోమవారం అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్‌నగర్‌కు చెందిన సంగీత తన కూతురు మానసిక వ్యాధితో బాధపడుతుందని, దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేసింది. ఆసిఫాబాద్ మండలం ఎల్లారం గ్రామానికి చెందిన అరిందుల సుధాకర్ తాను కొనుగోలు చేసిన భూమికి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించాడు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన కవిత మండల్ తన భూమిని 10 సంవత్సరలుగా ఒకరికి కౌలుకు ఇచ్చానని, ఇప్పుడు ఆ భూమి తనది అని ఆక్రమించుకున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని దరఖాస్తు ఇచ్చింది. జైనూరు మండలం సోనుపటేల్‌గూడ గ్రామానికి చెందిన మిశ్రమ తూర్పుబాయి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేసింది. రెబ్బెన మండలం కొండపల్లికి చెందిన సోనులే సంతోష్‌బాబు గ్రామ శివారులో గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించాడు. ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామానికి చెందిన మారెశెట్టి గురవయ్య తన భూమికి కొలతలు చేయడానికి ఎఫ్‌లైన్ డీడీ కట్టానని, కొలతలు చేయించాలని దరఖాస్తు అందజేశాడు. జైనూరు మండలం ఊసేగాం గ్రామానికి చెందిన శాయంసుందర్ తనకు ఎలాంటి వ్యవసాయ భూమి లేదని, కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నానని తనకు గ్రామ పంచాయతీలో కామాటిగా ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించాడు. సిర్పూర్(యు) మండలానికి చెందిన కొత్తురు ఆంధ్రయ్య తన తాతగారు గతంలో గ్రామ సేవకుడిగా పని చేస్తున్న సమయంలో ప్రభుత్వం కొంత భూమిని ఇనాముగా ఇచ్చిందని, దాన్ని తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశాడు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పెర్సాపెన్ ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

లింగాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘుమ్‌నూర్(బి) గ్రామంలో సోమవారం రామేకార్ కనక పెర్సాపెన్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోడళ్లకు బేటింగ్ నిర్వహించారు. ఉత్సవాలకు మహారాష్ట్రతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఆదివాసీలు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కనక సూర్యరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో గిరి ప్రదక్షిణ

రెబ్బెన, మే 19 (ఆంధ్రజ్యోతి): మండంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి నామస్మరణ చేస్తూ ప్రదక్షిణ కొనసాగించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలి

ఆసిఫాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని రహమ త్‌నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బావి స్థలం ఆక్రమణకు గురుకాకుండా చూడాలని కాలనీవాసులు బాలేష్, మహేష్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాల నిర్వాహకులు ప్రభుత్వ బావిలో చెత్తాచెదారం వేస్తూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో సాబీర్ అలీ, తయాబ్, గణేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో పోలీసులకు గుర్తింపు



పదోన్నతి చిహ్నం బహూకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి ద్వారానే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. హెడ్ కానిస్టేబు ల్ నుంచి ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన మీర్ ఉస్మాన్ అలీ, డి బాబా జీలకు సోమవారం పదోన్నతి చిహ్నం బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసు పూర్తి చేసి విధుల్లో మంచి పని తీరు కనబర్చిన మరిన్ని పదోన్నతులు పొందాల న్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని చెప్పారు. పెరిగిన బాధ్యతను క్రమ శిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీసు శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు క్రమ శిక్షణతో విధులు నిర్వహించారో అదే విధంగా మిగితా సర్వీసు పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అంజన్న, సీసీ కిరణ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు, ఇతరులను కించపరిచేలా పోస్టులు పెడితే గ్రూప్ అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం సంబంధిత పోస్టు స్టేషన్ సీఐ, ఎస్సైలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించు కోవాలని సూచించారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజలకే సేవ చేయడ మే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ నాయకులు, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను, ఇతరుల మనోభావాలను కించ పరిచేలా పోస్టులు చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

లింగాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈవో సేఖ్ ఖలీల్ అన్నారు. కంచన్‌పల్లి గ్రామ పంచాయతీ లోగల రైతువేదికలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవడం వల్ల రైతులకు కేంద్ర పథకాలు పొందేందుకు వీలు ఉంటుందని తెలిపారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బగూడలో రైతులకు ఏడీఏ వెంకటి అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వివిధ నిధుల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల రికార్డులను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పనులు త్వరితగిన పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఖర్జీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

దహెగాం, మే 19 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం ఖర్జీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో శ్యామూల్ మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్ట పోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ క్వింటాలు ధాన్యానికి 2,320, సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు 2,300 రూపాయలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకొస్తే వెంటనే కాంటా వేసే అవకాశం ఉందని చెప్పారు. రైతులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి సాగు లాభాలు బాగు

- నాటిన మూడేళ్లలో చేతికొస్తున్న పంట
- ఎకరానికి రూ.2లక్షల ఆదాయం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న జేకే యాజమాన్యం



తాండూరు శివారులో సాగు చేస్తున్న నీలగిరి



నీలగిరి చెట్లను కటింగ్ చేస్తున్న కూలీలు

కాగజ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): నీలగిరి సాగు చేస్తున్న రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. కాగజ్‌నగర్ ఎస్పీఎం జేకే యాజమాన్యం రూపొందించిన నీలగిరి వంగడాలతో మూడేళ్లుగా చేసిన ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయి. ఆంధ్ర, తెలంగాణల్లో ఈ సారి ఏకంగా పదివేల ఎకరాల్లో నీలగిరి సాగు చేసేందుకు సన్నాహం చేశారు. బీడు భూములున్న రైతుల వద్ద జేకే యాజమాన్యం ప్రతినిధులు వచ్చి పూర్తిగా అవగాహన కల్పిస్తున్నారు. జేకే వంగడాలతో పంటను ప్రారంభించి ఏపుగా వచ్చే వరకు కూడా కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, సం బంధిత అధికారులు నిత్యం పంటలపై మానిటరింగ్ చేస్తున్నారు. ఒక్కసారి నీలగిరి పంట ఏపుగా వచ్చిందంటే మూడేళ్లలోపే ఎకరానికి రూ.2లక్షల ఆదాయం వచ్చేలా మిల్లు పూర్తిగా చర్యలు తీసుకుంటుంది. పం ట పొలం నుంచే కటింగ్ చేసి నేరుగా మిల్లు ముడిసరుకును తీసుకుంటుంది. మందులు లేకుండా ఏకంగా లక్షల్లో ఆదాయాన్ని రైతులు పొందుతున్నారు. ఎస్పీఎం యాజమాన్యం ముడిసరుకు కొరత ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ప్రత్యేక వంగడాలను తయారు చేసి శాస్త్రీయత కోసం వివిధ పరీక్షలు నిర్వహించింది. అనంతరం మూడేళ్ల నుంచి మార్కెట్‌లోని రైతుల పొలాల్లో చేసిన ప్రయత్నాలు ఆశాజనకంగా వచ్చాయి.

జిల్లా రైతులు ఎక్కువగా..

జిల్లాలోని రైతులు పత్తి, వరి, ఇతర కూరగాయలు సాగు చేసేందుకు ఆసక్తి చూపు తుంటారు. అయితే బీడు భూముల విషయంలో అలాగే వదిలేస్తుండటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బీడు భూములు ఎంత మేర ఉన్నాయనే విషయంలో సర్వేలు చేసి సంబంధిత యాజమానులకు జేకే యాజమన్యం అవగాహన కల్పిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, మందమర్రి, తాండూరు, సిర్పూరు, కౌటాల, బెల్లంపల్లి ప్రాంతాల్లో 300 ఎకరాల్లో ఈ పంటను రైతులు పండిస్తున్నారు. అలాగే జగిత్యాల, కోరుట్ల తదితర మండలాల్లో కూడా ఈ పంటను వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతులకు అవగాహన..

బీడు భూముల్లో పంటలు వేసేందుకు జేకే యాజమాన్యం బృందం నేరుగా రైతులతో మాట్లాడి పంట వేసే విధానంపై అవగాహన కల్పిస్తోంది. ఈ ప్రక్రియ కాగానే విత్తనాలు వేసే విధానంపై కూడా అవగాహ కల్పిస్తున్నారు. ఈ విత్తనాలను కూడా యాజమాన్యం ఒక్క మొక్కకు రూ.3 చొప్పున రైతుకు విక్రయిస్తోంది. ఏపుగా వచ్చే విధానంపై జేకే యాజమాన్యం బృంద సభ్యులు నిత్యం రైతులతో మానిటరింగ్ చేస్తున్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన కూడా వెంటనే పరిష్కరించే దిశగా మిల్లులో ఒక విభాగం కూడా ఏర్పాటు చేశారు. మిల్లుకు నిత్యం వివిధ ముడిసరుకు వస్తుండడంతో దాదాపు 200 లారీల లోడ్ తెస్తుంటారు. రైతులు పండించిన నీలగిరి పంటకు నేరుగా పంట పొలం నుంచి కట్ చేసి మిల్లులో ప్రత్యేక గేటు ద్వారా వెళ్లేందుకు అనుమతించి నాలుగు గంటల్లోనే అన్‌లోడ్ చేసి డబ్బు లు సంబంధిత రైతుకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రెండు రాష్ట్రాల రైతులు ఇప్పుడు ఈ పంటపై అత్యధికంగా మొగ్గు చూపుతున్నారు. రైతులకు నీలగిరి పంటలపై అవగాహన కల్పించేందుకు ప్లేస్టోర్‌లో జేకే కిసాన్ మిత్ర యాప్‌ను రూపొందించారు.

పదెకరాల్లో సాగు చేశాం..: కృష్ణారావు, సిర్పూరు(టి)



పది ఎకరాల్లో నీలగిరి సాగు చేశాం. మూడేళ్లలో పంట చేతికొచ్చింది. దాదాపు 24 లక్షల ఆదాయం వచ్చింది. విత్తనం వేసే సమయం నుంచి కోత వరకు జేకే సిబ్బంది సూచనలు, సలహాలు అందించారు. మిల్లులో అన్‌లోడింగ్ చేసిన తర్వాత డబ్బులిచ్చారు. ఒక్కసారి పంట వేస్తే సరిపోతోంది. మూడేళ్లలో కటింగ్ ఉంటుంది. మళ్లీ రెండేళ్లలో కంటింగ్ అయిన మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. నీలగిరి సాగుతో ఎలాంటి మందులు వాడకం, అడవి పందుల బెడద లేకుండా ఉంది.

రైతులకు అవగాహన..: ఏకే మిశ్రా, మిల్లు యూనిట్ హెడ్



బీడు భూముల్లో నీలగిరి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తమ మిల్లులో తయారు చేసిన మేలైన జేకే వంగడాలతో బీడు భూముల్లో నీలగిరి సాగు చేసేందుకు ఏర్పాటు చేశాం. ప్రయోగాలు కూడా విజయవంతం అయ్యాయి. ఈ వంగడంతో మూడేళ్లలోనే పంట ఏపుగా పెరుగుతుంది. ఉమ్మడి జిల్లాలతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బీడు భూములున్న రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పదివేల ఎకరాల్లో నీలగిరి పంట సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.2లక్షల ఆదాయం ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బెల్లంపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు పృథ్వీరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయని టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. కాసిపేట 1గనిలో సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న పృథ్వీరాజ్ మందమర్రిలో నివాసముంటున్నాడు తాండూర్‌లో జరిగిన ఓ విందుకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా బైపాస్ రోడ్డు వద్ద కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన పృథ్వీరాజ్‌న మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం మత్తులో మహిళ మృతి

కాసిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని సోమగూడెం సింగరేణి క్వార్టర్‌లో సోమవారం ఉదయం మద్యం మత్తులో మహిళ మృతి చెందిందని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి జిల్లా చేల్పూరి గ్రామానికి చెందిన కుక్కల లలిత(45) కొంతకాలంగా మద్యానికి బానిసై ఊళ్లవెంట తిరుగుతోంది. ఇదేక్రమంలో 45రోజుల క్రితం సోమగూడెం భరత్‌కాలనీలోని బంధువుల ఇంటికి వచ్చింది. మద్యం తాగుతూ ఇంటి పట్టన ఉండకుండా తిరుగుతుండేది. వారం రోజులుగా మద్యం తాగుతూ తిరుగడం వల్ల సకాలంలో సరైన ఆహారం తినక అపస్మారక స్థితిలోకి వెళ్లి సోమవారం ఉదయం మృతి చెంది ఉంటుందన్నారు. మృతురాలి కూతురు పెద్దపల్లి రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

వేమనపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుయ్యారం గ్రామం శివారులో సోమవారం విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. బుయ్యారం గ్రామానికి చెందిన కొండి చిన్నబాపు, రాజయ్యకు చెందిన గేదెలు మేత కోసం వెళ్లగా వ్యవసాయ పంపు సెట్ల కోసం కర్రల సహాయంతో అమర్చిన విద్యుత్ తీగలు ఊడి గేదెలపై పడ్డాయి. విద్యుదాఘాతంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ. 90 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు. సంఘటన స్థలాన్ని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్, వెటర్నరీ వైద్యురాలు సుప్రియ, గోపాలమిత్ర శ్రీకాంత్ పరిశీలించారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్ ..చెలరేగిన మంటలు



అంటుకున్న మంటలు

మందమర్రిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వ జోన్ బ్రహ్మంగారి ఆలయ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారు. ఓవర్ లోడుతో ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. మంటలను ఆర్పివేసి విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు.

ముగ్గురికి గాయాలు

చింతలమానేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం ఆడెపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కాగజ్‌నగర్ మండలం బోడెపల్లికి చెందిన మహేష్, అశ్విని బైక్‌పై మహారాష్ట్రకు వెళుతున్నారు. ఆడెపల్లి సమీపంలో ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఆ బైక్‌పై శ్యాం అనే వ్యక్తి వస్తున్నాడు. ఈ ప్రమాదంలో అశ్విని కాలు విరిగింది. మహేష్, శ్యాంకు స్వల్ప గాయలయ్యాయి. అశ్వినిని మంచిర్యాలకు తరలించారు.

మూడు తులాల బంగారం చోరీ

కౌటాల, మే 19 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లికి చెందిన మహిళల మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. చింతలమానేపల్లి మండలానికి చెందిన అల్లి రమ్య, లక్ష్మి మంచిర్యాలలో సోమవారం పెళ్లికి హాజరయ్యారు. తిరిగి ఇంటికి చేరుకునేందుకు కాగజ్‌నగర్ నుంచి చింతలమానేపల్లి బస్సులో ప్రయాణిస్తున్నారు. లోనవెల్లికి వచ్చిన తర్వాత ఫోన్ వచ్చింది. హ్యాండ్ బ్యాగులోంచి ఫోన్ తీస్తుండగా అంతకు ముందే తెరిచి ఉంది. దీంతో బంగారుఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కౌటాల స్టేడియం సమీపంలో ఉన్న పోలీస్ చెక్ పోస్టు వద్ద బస్సును నిలిపివేశారు. ప్రయాణికులను తనిఖీ చేసిన బంగారం లభించలేదు. బంగారం ఎక్కడ పోయిందో అర్థం కాలేదని బాధితులు రోదిస్తూ పోలీసులకు తెలిపారు.

సకాలంలో ఉపాధి హామీ కూలీలకు వేతనాలు

నగేష్, ఈజీఎస్ ఏపీవో



ఆంధ్ర జ్యోతి: ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు అందించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఏపీవో: ఉపాధి పనులు చేసిన కూలీల మస్టర్ రోల్స్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నాం. కూలీలకు వేతనాలు వారం వారం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుం టున్నాం. ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీలో ఈ ఏడాది చేపడుతున్న పనులు ఏంటి?

ఏపీవో: ఉపాధి హామీ పథకం కింద పారంపౌండ్, చెక్ డ్యాంలు, చిన్న నీటి కుంటలు, కాంటూర్ కందకాలు వంటి పనులు చేపడుతున్నాం. ముందుగానే గ్రామసభల్లో పనులను ప్రతిపాదించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: గుట్ట భుముల్లో ఎలాంటి పనులు చేపడుతున్నారు

ఏపీవో: గుట్ట భుముల్లో బౌండరీ ట్రెంచెస్, నీరు మళ్లింపు కాలువల పనులు కొనసాగుతున్నాయి. ఉపాధి పనులకు గ్రామాల వారీగా పర్యవేక్షిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: నిబంధనల మేరకు కూలీలకు పనులు కల్పిస్తున్నారా?

ఏపీవో: ఉపాధి హామీ కూలీలకు నిబంధనల మేరకు వంద రోజుల వరకు పనులు కల్పించేలా చూస్తున్నాం. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు మూడు వందల రూపాయలు కూలీలకు అందుతోంది.

\- జైనూర్, ఆంధ్రజ్యోతి

'దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలి'

వాంకిడి, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బౌద్ధ మహాసభ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. దళిత విద్యార్థిపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు విజయ్, సందీప్, హంస రాజ్, ప్రతాప్, విలాస్, రమేష్, చింటు, పోచాలు, శివాజీ, దిలాజీ, మారుతి, చంద్రమణి పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ఆసిఫాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఎం నాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, శ్రీనివాస్, రాజేందర్, కార్తీక్, టీకానంద్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేందరంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి విద్యాశాఖ, పోలీసు, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల, మిషన్ భగీరథ, రోడ్డు రవాణా సంస్థ అధికారులతో అడ్వాన్స్‌డ్ సప్లి మెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 2వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఇందు కోసం జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. జైనూరు, కాగజ్‌నగర్, కౌటాల, కెరమెరి, ఆసిఫాబాద్‌లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్మీడియట్ జనరల్ పరీక్షకు 2,057 మంది, ఒకేషనల్‌లో 235 మంది విద్యార్థులు హాజరు కానున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రశ్న, జవాబు పత్రాల తరలింపులో జాగ్రత్త వహించాలని సూచించారు. అంతకు ముందు ఇంటర్ బైపీసీ గ్రూపులో 990 మార్కులు సాధించిన తిర్యాణి ప్రభుత్వ కళాశాల విద్యార్థిని గున్నాల పూజితతో పాటు సీఈసీలో 947 మార్కులు సాధించిన కాగజ్‌నగర్ ప్రభు త్వ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎ ప్రేమలను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధి కారి కళ్యాణి, జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ఉదయ్‌బాబు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



ఇంటర్ బైపీసీ గ్రూపులో 990 మార్కులు సాధించిన విద్యార్థిని పూజితను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 2025-26 విద్యా సంవత్సరానికి పాఠశాలల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి సజీవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో ప్రైవేటు పాఠశాలల ప్రతిపాదనలు ఈ నెల 24వ తేదీ వరకు కార్యాలయాలని పంపించాలని పేర్కొన్నారు. ఎంపికైన పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో ప్రవేశం పొందిన ఐదో తరగతి విద్యార్థులకు రూ.42 వేలు ఉపకార వేతనం, ఉచిత హాస్టల్, భోజన వసతితో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల అందజేస్తారని తెలిపారు. ఒకటో తరగతి (డే స్కాలర్)లో ఎంపికైన విద్యార్థులకు రూ.28 వేలు ఉప కార వేతనాలు ట్యూషన్‌తో పాటు ఉచిత రెండు జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు కోసం చెల్లిస్తారని తెలిపారు. వివరాలకు 98668 53227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



కేంద్ర విధానాలపై కార్మికులు ఉద్యమించాలి

శ్రీరాంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులు ఉద్య మించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కనీస పెన్షన్‌ను రూ.9 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. హమాలీ, బీడీ, భవన నిర్మాణం, ఆటో అండ్ మోటార్, తదితర రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్, బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయా డిమాండ్లపై మంగళవారం జరిగే నిరసనలను విజయవంతం చేయాలని తెలిపారు. గతంలో దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన సమ్మె చేయాలని భావించినప్పటికీ దేశ పరిస్థితుల దృష్ట్యా జూలై 9వ తేదీకి వాయిదా పడిందని పేర్కొన్నారు. నేపథ్యంలో కార్మికులంతా తమ పనిప్రదేశాలు, మండల, జిల్లా కేంద్రాలలో నిరసనలు చేపట్టాలని ఆయన కోరారు. కేంద్రం తీసుకొస్తున్న చట్టాలను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

జైపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు యోగా, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి అన్నారు. సింగరేణి పవర్ ప్లాంట్‌లో అంతర్జాతీ హైపర్‌టెన్షన్‌డేను పురస్కరించుకుని సోమవారం సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు బీపీ, బీఎంఐ వైద్య పరీక్షల శిబిరాన్ని జీఎం శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ప్రతి రోజు గంట వ్యాయామం చేయాలన్నారు. బీపీ వ్యాధిగ్రస్తులు ధూమపానం, మద్యపానం మానివేస్తే అదుపులో ఉంటుందన్నారు. వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. వైద్యరంగంలో సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. ప్రతి ఒక్కరు క్రమంతప్పకుండా బీపీ చెక్ చేయించుకోవాలని, సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఉంటే ఉప్పు తగ్గించాలని, నడక, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు మురళీధర్, మదన్‌మోహన్, శ్రీనివాస్, అజాజు ల్లాఖాన్, అజ్మీర తుకారాం, వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి కోరారు. ఈ మేరకు వారు సోమవారం సెంటినరీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లును కలిసి వినతిపతం అందించారు. అనంతరం మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయగా, 37 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరిగిందన్నారు. వాస్తవ లాభాలు రూ.4,701 కోట్లుగా ప్రకటించాలన్నారు. సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ మళ్లింపులు రూ.2,289 కోట్లు పోను, మిగిలిన రూ.2,412 కోట్లలో 33శాతం రూ.795.96 కోట్లను కార్మికులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 69.01 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి జరిగిందన్నారు. ఆర్థిక సంవ త్సరం ముగిసి రెండు నెలలు కావస్తున్నా లాభాల వాటాపై ఇంకా ప్రకటన డలేదన్నారు. యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రౌతు రమేష్, దొనికిన రమేష్, కిరణ్ కుమార్, సల్ల వేణు, పాక కృష్ణ, కందుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా

కప్‌బోర్డులు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల కోసం కప్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. శ్రీరాంపూర్‌లోని సీహెచ్‌పీని సోమవారం వారు సందర్శించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, సెకండ్, నైట్ షిఫ్టులలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లను నియమించాలని, ఫ్యాబ్రికేషన్ కోసం వేరుగా షెడ్లను నిర్మించాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, వేడి నుంచి ఉపశమనం కోసం కూలర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్ర మంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ స్టాఫ్ నాయకులు అడ్డూరి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి సాయిరాజు, నాయకులు అశోక్ రెడ్డి, మాహే, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక సర్క్యులర్‌ను రద్దు చేయాలి

మందమర్రిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులకు సంబంధించి ఇటీవల యాజమాన్యం ప్రవేశపెట్టిన అక్రమ బదిలీల సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సర్క్యులర్ కార్మికుల పాలిట శాపంగా మారిందన్నారు. సమావేశంలో నాయకులు మిట్ట సూర్యనారాయణ, వెంకటస్వామి, ఓదెలు, వరుణ్, సదయ్య, స్వామి, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చూడండి

శ్రీరాంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మందుల కొరత లేకుండా చూడాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండం రాజు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి భూపెల్లి మాధవ్, ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో కోరారు. సింగరేణిలో దాదాపు 40 వేల మంది ఉద్యోగులు, 82,387 రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. సింగరేణి ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి వెంటనే మందులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలక్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): రెండో విడత ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపు కోసం చేపట్టే శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో మొదటి విడత ఉపాధ్యాయులు హాజరుకాని వారు కూడా ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చునని సూచించారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.

పుష్కరస్నానం పుణ్యఫలం



- ఐదో రోజున 60వేల మంది భక్తులు
- పుష్కర స్నానం చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతి.. నమోనమామి అంటూ వేల మంది పుష్కరాలకు తరలొస్తున్నారు. కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో అంతర్వాహిని చెంత పలు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు పుణ్యస్నానాలాచరించి.. ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఉదయం వచ్చి రాత్రి జరిగే సరస్వతీ నదీ హారతి వరకు ఉండి ఆ మహాఘట్టాన్ని చూసి పరవశించిపోతున్నారు. ఐదో రోజైన సోమవారం 60 వేల మందికి పైగా భక్తులు పుణ్య స్నానా లు ఆచరించారు.

తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీవీఐపీల తాకిడి పెరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు, నాసిక్త్రయం భకేశ్వర్ పీఠాధిపతి మహామండలేశ్వర స్వామిజీ, హై కోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు దంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి పుణ్య స్నానాలు ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

పుష్కరాలు ప్రారంభమై సోమవారానికి ఐదోరోజు కాగా.. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధికంగా వస్తారని అధికారులు అంచనా వేశారు. తొలి నాలుగు రోజులతో పోలిస్తే రద్దీ తక్కువగా కనిపించింది. ఈ క్రమంలో నాలుగు రోజుల్లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందు లపై సమీక్షించుకున్న అధికార యంత్రాంగం ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనాలతో అధికారులు చలువపందిళ్లను మరి కొన్నింటిని పెంచారు.

● ట్రాఫిక్ క్రమబద్ధీకరణ..

శని, ఆదివారాల్లో తలెత్తిన ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఆదివారం ఉత్పన్నమైన సమస్యలను దృష్టిలోపెట్టుకుని జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను వేర్వేరు మార్గాల్లో నడిపించేందుకు కార్యాచరణ తయారుచేసింది. ఇందులో ఆర్టీసీ బస్సులను నేరుగా కాళేశ్వర క్షేత్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా ప్రైవేటు వాహనాలను అన్నారం క్రాస్ నుంచి చంద్రుపల్లి, పుస్కుపల్లి మార్గం మీదుగా మళ్లించాలని, లేదా కాటారం, గంగారం క్రాస్, దామెర కుంట మీదుగా కాళేశ్వరం వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.





స్నానాలాచరిస్తున్న భక్తులు



ఐదురోజుల్లో రూ.57.04 లక్షల ఆదాయం

కాళేశ్వరం: సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయానికి ఆదాయం పెరిగింది. ప్రత్యేక దర్శనాల టికెట్లు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఐదు రోజుల్లో దేవస్థానానికి 57.04 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. లడ్డూ పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని, భక్తులు సంతృప్తిగా కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారం రోజుల్లో కోటికి పైగానే ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అన్నారు.




పుణ్యస్నానాలాచరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పుణ్యస్నానాలాచరిస్తున్నహై కోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు కుటుంబ సభ్యులు



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



వాహనాల పార్కింగ్

బండి సంజయ్‌కి ఘన స్వాగతం



బండి సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరం వెళ్తున్న సందర్భంగా సోమవారం చెన్నూరు వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయ కులు శ్రీపాల్, రాజశేఖర్, సమ్మయ్య, వెంకటేశ్వర్, తిరుపతి, వెంకట నర్సయ్య, శ్రీనివాస్, బాబు, శివకృష్ణ, పున్నంచంద్, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశంలో రసాభాస

చెన్నూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కాంగ్రెస్ పార్టీ సమావేశం రసాభాసగా ముగిసింది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులు, రాష్ట్ర ఆయిల్ అండ్ ఫెర్టిలైజర్స్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రాంగోపాల్ ఎదుట నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగగా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని కోటపల్లి, భీమారం, జైపూర్, చెన్నూరు, మందమర్రి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశీలకులు ప్రసంగిస్తున్న సమయంలో చెన్నూరు పార్టీ నాయకులు, కార్యకర్తలు జోక్యం చేసుకుని కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదని వాపోయారు. అలాగే పట్టణ మాజీ కౌన్సిలర్ పోగుల సతీష్ ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులను నిలదీశారు. దీంతో మందమర్రి పట్టణానికి చెందిన టీపీసీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య ఆందోళన చెలరేగగా అది వివాదానికి దారి తీసింది. సమస్యలపై ప్రశ్నిస్తున్న నాపై రఘునాథ్‌రెడ్డి చేయి చేసుకున్నాడని మాజీ కౌన్సిలర్ పోగుల సతీష్ ఆరోపించాడు. దీంతో గొడవ తీవ్ర స్థాయికి చేరడంతో అక్కడే ఉన్న పోలీసులు కల్పించుకుని ఇరు వర్గాల వారిని అక్కడ నుంచి పంపించివేయడంతో గొడవ సద్దుమణిగింది.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

జైపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఇందారం గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ సోమవారం ప్రజావాణిలో డిప్యూటి తహసీల్దార్ మాధవికి వినతిపత్రం అందించారు. ఇందారం గ్రామంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసినప్పటికీ గంగిపెల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పేరిట టోకెన్‌లు తీసుకుని ఒక్కో కూపన్ మీద పది ట్రాక్టర్ల ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు.

అటవీ శాఖ చెక్‌పోస్టు ప్రారంభం



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, అధికారులు

కోటపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుపెల్లి వద్ద 63వ నంబరు జాతీయ రహదారిపై అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ సోమవారం ప్రారంభించారు. ఇక్కడ 24 గంటల పాటు నిరంతర నిఘా ఉంటుందని, అటవీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నూరు, కోటపల్లి అటవీ శాఖ రేంజర్లు శివకుమార్, సదానందం పాల్గొన్నారు.

జీవకోటికి బతుకు భయం

- అభివృద్ధి పేరిట విధ్వంసం
- తరిగిపోతున్న పచ్చదనం
- 22న ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం



నస్పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): భూమి మీద ప్రతీ జీవికి ఒక ప్రత్యేకత ఉంది. ఈగ, దోమ, గద్ద, ఎద్దు, నత్త, పీత సూక్ష్మజీవులు ఎంతో కొంతప్రాధాన్యం కలిగి ఉన్నాయి. ఇవన్నీ పరోక్షంగా ఒకదానికొకటి ఆధారపడి జీవిస్తూ ప్రకృతిలో ఆహ్లాదాన్ని నింపుతూ వాటి ధర్మాన్ని అవి నిర్వర్తిస్తున్నాయి. మానవుడి విలాసవంతమైన జీవితం ప్రకృతిని శాసిస్తున్నందున మానవ మనుగడ తో జీవ వైవిధ్యం ప్రశ్నార్థకంగా తయారైంది. జీవ వైవిధ్యానికి ఆయువు పట్టుగా నిలిచిన అడవులు, నీటి ఆవాసాలు ధ్వంసమై పోతున్నాయి. వీటిపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. పులులు, రుతలు, ఎలుగు బంట్లు, జింకలు, మనుబోతులు, నీలుగాయి, రాబందులు, సీతాకొకచిలు కలు, బట్టమేక పిట్టలు, ఊర పిచ్చుకలు, పాలపిట్టలు, అడవి పావురాలు, రకరకాల అడవి కోళ్లు, తదితర పక్షులు కనిపించకుండా పోయాయి. ఈ నెల 22 బుధవారం ప్రపంచ జీవవైవిధ్య సంరక్షణ దినం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ఐక్య రాజ్య సమితి 1992లో బ్రెజిల్ రాజధాని రియో డి జెనీరియోలో తొలిసారిగా జీవ వైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించింది. 2012లో హైదరాబాద్‌లో 11వ జీవ వైవిధ్య సదస్సు నిర్వహించగా ఇందులో 193 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతినబూనాయి. భారత ప్రభుత్వం 2002లో జీవ వైవిధ్య చట్టాన్ని తీసుకువచ్చింది. వన్యప్రాణులను వేటాడే వేటగాళ్లకు బయోడైవర్సిటీ యాక్ట్-2002 ప్రకారం నాన్ బెయిలబుల్ శిక్షలను విధించే అవకాశం ఉంటుంది. మంచిర్యాల జిల్లాలో లక్షకు పైగా హెక్టార్ల అటవీ విస్తీర్ణం కలిగి ఉండగా ఎన్నో జీవజాతులకు అనుకూలంగా ఉన్నది.

● పచ్చదనం పెరగాలి..

అటవీ సంపద తరిగిపోవడం వలన పక్షులకు, జంతువుల సహజ సిద్ధమైన ఆవాసాలు కోల్పోయి వాటి జీవన విధానానికి ముప్పు వాటిల్లడంతో అంతరించి పోతున్నాయి. భూగోళంపై జీవిస్తున్న అన్ని జీవకోటి ప్రాణులతో మానవుడికి ప్రత్యక్షంగానో, పరోక్షంగా సంబంధాలు ఉన్నాయి. మానవుడి దెబ్బకు పుడమి పేగు తెంచుకుని అడవులపై ఆధారపడి జీవిస్తున్న చాలా ప్రాణులు కనుమరుగవుతున్నాయి. అభివృద్ధి పేరిట సాగుతున్న విధ్వంసం కారణంగా నేడు భూతాపం విపరీతంగా పెరుగుతోంది. మానవాళి చర్యల కారణంగా ఓజోన్ పొర ఛిద్రమవుతూ భూగోళాన్ని మరింతా వేడి పుట్టిస్తోంది. అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతున్న మనం జీవ వైవిధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఎన్నో పర్యావరణ సమస్యలను, భయంకర విపత్తులను కారణమవుతున్నాం. జీవ వైవిధ్య సమతుల్యంగా ఉంటేనే మానవుడి జీవనం ముందుకు సాగుతుంది. పచ్చదనం పెంపునకు, జంతుజాలాన్ని కాపాడేందుకు కృషి చేసినప్పుడే జీవివైవిధ్యం వర్ధిల్లుతుంది.

పేకాట స్థావరంపై దాడి

లక్షెట్టిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరిరోడ్డులో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 2,720 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేష్ చెప్పారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

హాజీపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని ఎంఈవో తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముల్కల్ల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఈ పాఠ్యపుస్తకాల పంపిణీ ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధించిన పాఠ్యపుస్తకాలను తీసుకోవాలని సూచించారు. సోమవారం ముల్కల్ల ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, మహాత్మజ్యోతిబాపులే, కేజీబీవి దొనబండ ఉన్నత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

తహసీల్దార్‌గా జ్యోత్స్న

తాండూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండల తహసీల్దార్‌గా యు జ్యోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

నీడ సౌకర్యం కల్పించాలి

తాండూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ బ్యాంకుల వద్ద నీడ సౌకర్యం కల్పించాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ సోమవారం డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

కవి సమ్మేళనం విజయవంతం చేయాలి

మంచిర్యాలక్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే యువ కవుల సమ్మేళనంను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం తన నివాసంలో జాగృతి గోడ ప్రతులను ఆవిష్కరిం చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యువ కెరటాలు శీర్షికతో హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత అధ్యక్షతన సరస్వతి పరిషత్‌లో కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. జరిగిందని కవులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు కందుల ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకులు పడాల రవీందర్, పుల్లూరి మౌని, రాకేశ్, మారుతి, మహేశ్, రంజిత్, వికాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

నస్పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, భీంసేన్, తోకల వెంకటేశ్, రాములు, కిరణ్ పాల్గొన్నారు.

చెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలి

లక్షెట్టిపేట, మే 19(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఇటిక్యాల చెరువుకు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలని గంగాపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు మేడి రాజేష్ అధికారులను కోరారు. శనివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో గంగాపుత్ర సంఘంతో పాటు చెరువు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి భీమయ్య, చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ సప్ప రవి, గంగాపుత్ర సంఘం గౌరవ అధ్యక్షుడు పోశన్న పాల్గొన్నారు.

● తమ పట్టా భూములపై ఎవరైనా అసత్య ఆరోపణలు చేసినా భూములకు నష్టం కలిగించినా ఊరుకునేది లేదని చెరువు పరిసర ప్రాంత పట్టాదారులు హెచ్చరించారు. శనివారం పట్టాదారులు తమతమ పట్టా భూముల్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

'అశాంతి వాతావరణం నెలకొల్పుతున్న ఎంపీ'

మంచిర్యాలక్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా సోదరబావంతో జీవిస్తున్న మంచిర్యాల నియోజకవర్గంలో అశాంతి వాతావరణం నెలకొల్పేందుకు ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ ప్రయత్నిస్తున్నారని దళిత సంఘం నాయకులు ఆరోపించారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నేతకాని కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్, జుమ్మిడి గోపాల్, దశరథం పాల్గొన్నారు.

గోడను తొలగించాలి

జన్నారం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనానికి వెళ్లే రహదారిలో కొంత మంది అడ్డంగా గోడను కట్టారని, గోడను తొలగించాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్‌కుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఆదివాసీ గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం



డీటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, గిరిజనులు

దండేపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): కోయపోచగూడ ఆదివాసి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుడా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కనికారపు అశోక్, దుంపల రంజిత్‌కుమార్ అన్నారు. దండేపల్లి మండలం మాకులపేట పంచాయతీ పరిధిలోని కొయపోచగూడ చెందిన గిరిజనులతో కలిసి సోమవారం సీపీఎం నాయకులు దండేపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటి తహసీల్దార్ విజయకు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను సమర్పించారు. వారు మాట్లాడుతూ మాకులపేట శివారులో లింగాపూర్ అటవీ బీట్‌లో సర్వే నంబర్ 25, 26లో 200 ఎకరాల అటవీ భూమి ఉందని, 2002 నుంచి కోయపోచగూడ గిరిజనులు సాగు చేస్తున్నరన్నారన్నారు. గిరిజన గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం పోడు లిస్టులో చేర్చకూడా గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో గిరిజనులు రాజలింగు, ఎల్లయ్య, రమేష్, మహేశ్వరి, తార సీపీఎం నాయకులు బాపు, పోసవ్వ, పోషం, గిరిజనులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు

మందమర్రిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులు అకాల వర్షాల వల్ల ధాన్యం తడవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రానికి రోజు రెండు లారీలు మాత్రమే వస్తున్నాయని లారీల సంఖ్యను పెంచి కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని తరలించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు

జైపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంగిపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు రాజబాపురెడ్డి, శీలం వెంకటేశం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు గౌరవాన్ని తెచ్చింది మేమే

కాసిపేట, మే19(ఆంధ్రజ్యోతి): దేవాపూర్ సిమెంట్ కంపెనీలోని కార్మికులకు సరైన గుర్తింపు, గౌరవాన్ని తెచ్చిన ఘనత తమ యూనియన్‌దే అని మాజీ ఎమ్మెల్సీ, సిమెంట్ ఓరియంట్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాములు నాయక్ అన్నారు. సోమవారం దేవాపూర్ సిమెంట్ కంపెనీ గేటు ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యాజమాన్యం పోరాడి ఎన్నో హక్కులను సాధించామన్నారు. ఈ సారి జరిగే సిమెంట్ కంపెనీ ఎన్నికల్లో పోటీలో ఉంటానని తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కత్రు బీంరావు, ఎనగందుల శ్రీనివాస్, సారే రాజయ్య, పెద్దల తిరుపతి పాల్గొన్నారు.

సహారా కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

నస్పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సహారా ఇండియాలో పాలసీలు, డిపాజిట్లు చేసిన ఖాతాదారులకు గడువు ముగిసినా వాటికి తిరిగి చెల్లించడంలో సంస్థ కాలయాపన చేస్తోందని నిరసిస్తూ సోమవారం పలువురు బాధితులు నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ బ్రాంచీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ తాము సింగరేణిలో కష్టపడి పోగేసిన సొమ్మును సహారా ఇండియాలో డిపాజిట్ చేస్తే పాలసీ గడువు ముగిసి మూడేళ్లు గడిచినా కాలయాపన చేస్తున్నట్నారు. సింగరేణి విశ్రాంత కార్మికుల సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య, బాధితులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక శోభతో కళకళాడుతున్న మందమర్రి'

మందమర్రిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మందమర్రి పట్టణం మూడురోజులుగా ఆధ్యాత్మిక శోభతో కళకళాడుతుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. సోమవారం రాత్రి పట్టణంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ రథోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యేకు దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాలతో సన్మానించారు.



జీవకోటికి బతుకు భయం..





- పెరుగుతున్న విధ్వంసం
- తరిగిపోతున్న పచ్చదనం
- అరుదైన జీవ జాతులు మాయం
- 22న ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం

7

మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం మూలంగా జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. పర్యావరణానికి దోహదపడే జీవరాశులు రోజురోజుకు అంతరించిపోతున్నాయి. అటవీ సంపద తరిగిపోతుడండంతో పక్షులు, జంతువుల సహజ సిద్ధమైన ఆవాసాలు కోల్పోయి వాటి జీవన విధానానికి ముప్పు వాటిల్లుతోంది. జీవ వైవిధ్యం సమతుల్యంగా ఉంటేనే మానవుడి జీవనం ముందుకు సాగుతుంది. పచ్చదనం పెంపునకు, జంతుజాలాన్ని కాపాడేందుకు కృషి చేసిప్పుడే జీవివైవిధ్యం వర్ధిల్లుతుంది. ఈ నెల 22న ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'ప్రత్యేక కథనం.. - నస్పూర్

కాళ్లతో పరీక్ష రాసిన విద్యార్థి


కాళ్లతో పరీక్ష రాస్తున్న శంకర్

బెల్లంపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): చేతులు లేకపోవడంతో ఓ విద్యార్థి కాళ్లతో పరీక్షలు రాసి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరి శంకర్ తొమ్మిదో వతరగతి చదువుతున్న సమయంలో విద్యుదాఘాతంతో తగిలి రెండు చేతులు కోల్పో యి అంగవైకల్యమయ్యాడు. అయినప్పటికీ చదువుపై ఉన్న శ్రద్ధతో ఆత్మ స్థైర్యంతో పది, ఇంటర్ పరీక్షలు రాసి ప్రస్తుతం డిగ్రీకి చేరుకున్నాడు. కాగా సోమవారం కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ ఫైనల్ ఇయర్ ఆరో సెమిస్టర్ తెలుగు పరీక్షకు హాజరై కాళ్లతో పరీక్ష రాశాడు. ఆయనతో పాటు పరీక్ష రాస్తున్న విద్యార్థులు శంకర్‌ను అభినందించారు.

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ, నిషేధిత విత్తనాల రవాణా, విక్రయం వినియోగాన్ని అరికట్టే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా, డీసీపీబాస్కర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పనలతో కలిసి మండల తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు పోలీసుశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో బీటీ పత్తి విత్తనాలతో పాటు బోల్‌గార్డ్1, 2 రకాలను ఉపయోగించవచ్చని, బోల్‌గార్డ్-3 రకాన్ని నిషేధించారన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- ఏసీబీ కార్యాలయం ప్రారంభోత్సవంలో డైరెక్టర్ తరుణ్ జోషి


ఏసీబీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న తరుణ్ జోషి

నస్పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అవినీతి నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో ముఖ్యమని ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ టౌన్‌షిప్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి రైలు మార్గం ద్వారా ఇక్కడకు చేరుకున్న తరుణ్ జోషికి ఏసీబీ, పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తరుణ్ జోషి మాట్లాడారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల కేసులకు సంబంధించి ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చునన్నారు. నిరంతరం అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇది వరకు ఆదిలాబాద్‌లో కార్యాలయం ఉన్నందున ఇక్కడి నుంచి వచ్చే ఫిర్యాదు దారులు ఇబ్బందులు పడ్డారని, అంతేగాకుండా కేసుల పరిశోధనలో అధికారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు కలిపి ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎవరైన లంచం అడిగితే వారిపై వెంటనే ఫిర్యాదు చేయవచ్చునని తరుణ్ జోషి సూచించారు. 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేసే సౌకర్యం ఉందన్నారు. దీంతో పాటు వెబ్ సైట్‌లో కూడా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించామన్నారు. బాధితులు కాల్ చేసిన వెంటనే రికార్డు చేసుకొని కేసును పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాదేశ్యాం మురళి, రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, కరీంనగర్ ఏసీబీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతి, మంచిర్యాల, కరీంనగర్ డీఎస్పీలు విజయ్‌కుమార్, రమణమూర్తి, సీఐలు కిరణ్‌కుమార్, క్రిష్ణకుమార్, ఏసీబీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి సమీక్ష


వీడియో సమీక్షలో పాల్గొన్న అధికారులు

కాసిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలానికి చెందిన అధికారులు పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ లేవల్ వరకు ఒక లక్ష రూపాయల నిధులు విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, కార్యదర్శి సురేశ్, లక్ష్మీనారాయణ, ఇందిరమ్మ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరు

నెన్నెల, మే 19 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జంగాల్‌పేటలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి మొదటి విడత బిల్లు మంజూరయిందని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలిపారు. పునాదుల వరకు పనులు పూర్తి చేసిన ఇద్దరు లబ్ధిదారులకు రూ. ఒక్క లక్ష చొప్పున సోమవారం వారి ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. దశల వారీగా అందరూ లబ్ధిదారులకు బిల్లులు అందజేస్తామన్నారు.

వరి పంట నష్టంపై సర్వే


గొల్లపల్లిలో దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో సృజన

నెన్నెల, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన తెలిపారు. మైలారం, గొల్లపల్లి ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి పొలాలను సోమవారం పరిశీలించామన్నారు. వంద ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి సాయం అందేలా చూస్తామని ఏవో చెప్పారు.

ఉపాధిహామీ పథకం ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్

తాండూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు, పనిచేసే ప్రదేశంలో ఏమైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. అర్హులైన వారికి జాబ్‌కార్డు జారీ కాకున్నా, పనిచేసే ప్రదేశంలో వసతులు కల్పించకున్నా, చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేస్తే 18002001001 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇది 24 గంటలు పనిచేస్తుందని, దీంతో కూలీలకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు.

భూమి హక్కు పత్రాలు లేనివారు సాగు చేయవద్దు


లక్ష్మీపూర్‌లోని పోడు రైతులతో మాట్లాడుతున్న దేవాపూర్ ఎఫ్ఆర్‌వో అ నిత

కాసిపేట, మే19(ఆంధ్రజ్యోతి): పోడు ప్రభుత్వ అనుమతి హక్కు పత్రాలు లేకుండా ఎవరు కూడ ఈ ఏడాది సాగు చేయవద్దని దేవాపూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అనిత సూచించారు. సోమవారం సోనాపూర్ అటవీ సెక్షన్ పరిధిలోని లక్ష్మీపూర్‌లో పోడు సాగురైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి హక్కు పత్రాలు లేకుండా భూమిని సాగు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది నుంచి ఎవరు కూడ పోడు భూములను సాగు చేయవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించి భూములు సాగు చేస్తే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కె రాము, ఫారెస్టు బీట్ ఆఫీసర్ సీహెచ్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దుచేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యకు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు అడ్మిషన్లు చేసుకుంటూ కరపత్రాలు, ఫ్లెక్సీలతో ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లను ఇంటింటికి పంపుతూ అడ్మిషన్లు చేసుకొని వేల రూపాయలు వసూలు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారి స్పందించాలని కోరారు. ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. సికిందర్, జిల్లా నాయకులు రాహుల్ పాల్గొన్నారు.

మంత్రి 'పొంగులేటి' పర్యటనను విజయవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఓఆర్‌ఓ చట్టం -2025లో భాగంగా జిల్లాకు వస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమం సంబందించిన ఏర్పాట్లను జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ సదానందం, ప్రత్యేక తహసీల్దార్ వనజరెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ ప్లాంట్‌లోని హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- **భీమారం (ఆంధ్రజ్యోతి) :** భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మంగళవారం భీమారంకు రానుండగా సోమవారం ఏర్పాట్లను డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. సభ కోసం భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ వేణు చందర్, అధికారులు పాల్గొన్నారు.

యజ్ఞంలా ధాన్యం కొనుగోలు..

మంచిర్యాలకలెక్టరేట్, మే19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఒక యజ్ఞంలా కొనసాగుతోందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 345 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు లక్షా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరిందన్నారు, 36 కొనుగోలు కేంద్రాల్లో లక్ష్యం పూర్తి కాగా వాటిని మూసి వేశామని తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్, జిల్లా అధికారి, అదనపు కలెక్టర్ అందుబాటులో ఉంటారని, కాల్ సెంటర్‌లో సంప్రదించవచ్చునని, అన్ని వేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.

పట్టణాభివృద్ధికి పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. సోమవారం రాత్రి బీ1 క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి విజయం కట్టబెట్టిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతానన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ విమర్శలను ప్రజలు నమ్మవద్దన్నారు. రాష్ట్రంలోనే చెన్నూరు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణ పనులు నిలిపివేత

- అధికారుల తీరుపై నిరసన


నిర్మాణం పనులు నిలిపివేస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

నెన్నెల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట సర్వే నంబరు 876లో చేపట్టిన ఇంటి నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులు పనులను అడ్డుకోగా, తమపై అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఇంటి యజమాని, అతడి కుటుంబీకులు సోమవారం ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డు పక్కన కీసరి సాయికుమార్ అనేవ్యక్తి కంటేనర్ హౌజ్ నిర్మాణం చేపట్టగా ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని ఫిర్యాదులు అందడంతో రెండు రోజుల కిందట బెల్లంపల్లి ఆర్డీవో ఇంటిని సీజ్ చేశారు. సాయికుమార్‌పై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయినప్పటికి పనులు కొనసాగుతున్నాయని తెలుసుకున్న అధికారులు సోమవారం మరోసారి వెళ్లారు.

డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ సులోచన, ఎస్సై ప్రసాద్ సిబ్బందితో చేరుకొని పను లను నిలిపివేశారు. ఇంటి నుంచి బయటకు వస్తే సీజ్ చేస్తామని చెప్పారు. సాయికుమార్‌తో పాటు అతడి తల్లి, భార్య పిల్లలు లోపలి నుంచి బయటకు వచ్చేందుకు నిరాకరించారు. మహిళా పోలీసులు తల్లి సుశీలను బయటకు తీసుకురాగా ఆమె ఏడుస్తూ స్పృహ కోల్పో యింది. ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లికి తరలిం చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిని సీజ్ చేయాల్సిం దేనని చెప్పి మిగతా వారిని కూడా బయటకు పంపి తాళాలు వేశా రు. తన భార్య ఒంటిపై బంగారం అమ్మి కొనుక్కున్న స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రాజకీయ నాయకుల ఒత్తిడితో పనులను అడ్డుకుంటు న్నారని కీసరి సాయికుమార్ వాపోయారు. తమను మాత్రమే టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి


ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన అక్కపురం రాజయ్య సింగాపూర్ గ్రామ శివారులో తనకు చెందిన భూమి సింగరేణి ఓపెన్‌కాస్టులో పోయిందని నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కామెర లక్ష్మి, మేస్త్రీ కీర్తిమాల తమకు సొంత ఇంటి స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన తిప్పని సాయితేజ తన భూమి ఆక్రమణకు గురవుతుందని ఈ విషయమై న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణం రైల్వే స్టేషన్ రడగంబాల బస్తీకి చెందిన యాదరి కవిత తమ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం దూరంగా ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వాణి కార్యక్రమంలో అందిన ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.